సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.8 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,150 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
33.8°/20.5°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో పశ్చిమ దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'ఈ-క్రాప్' నమోదు వేగవంతం చేయండి


కదిరిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామునాయక్

కదిరి అర్బన్: 'ఈ–క్రాప్' నమోదు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి రాము నాయక్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కదిరిలోని కుటాగుళ్ల, ముత్యాలచెరువులో పర్యటించారు. ఈ సందర్భంగా కుటాగుళ్లలో రైతు సిద్దప్ప సాగు చేస్తున్న పంట వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేశారా... అని స్థానిక వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముత్యాలచెరువులోని తిరుపాల్‌నాయక్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులు కూడా ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలను 'ఈ–క్రాప్'లో నమోదు చేయించుకోవాలని, లేకపోతే ప్రభుత్వం అందించే సబ్సిడీలు, పంట నష్టపరిహారం వర్తించబోవన్నారు. ఏడీఎం సనావుల్లాతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రాయితీ జమ అయ్యేలా చూడండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని అర్హులందరికీ 'దీపం -2' పథకం రాయితీ జమయ్యేలా చూడాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సీఎస్‌డీటీలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. 'దీపం-2' పథకం కింద రాయితీ జమకానీ, ట్రాన్సక్షన్ ఫెయిల్ అయిన కేసులపై ఆరా తీశారు. రాయితీ జమ కాని 'దీపం-2' లబ్ధిదారుల వివరాలు వెంటనే అందించాలని ఆదేశించారు. అర్హులందరికీ రాయితీ జమ అయ్యేలా గ్యాస్ ఏజెన్సీలు బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సీఎస్‌డీటీలు కూడా ఈ అంశంపై ప్రతివారం సమీక్షించాలన్నారు. సమావేశంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, ఎల్‌డీఎం రమణకుమార్, సీఎస్‌డీటీలు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండోదశ డిగ్రీ అడ్మిషన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డిగ్రీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం నుంచి రెండోదశ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్కియాలజీ, హిస్టరీ, స్టాటిస్టిక్స్, జర్నలిజం, క్రియేటివ్ రైటింగ్, డేటా సైన్స్, మార్కెటింగ్ అండ్ సేల్స్, బయో ఇన్ఫర్మేటిక్స్, ఆర్గానిక్ ఫార్మింగ్, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, తెలుగు, మ్యాథమెటిక్స్, అనిమల్ బయోటెక్నాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఈ నెల 29 నుంచి అక్టోబర్ 1వరకు వెబ్ ఆప్షన్ ఎంపిక ఉంటుంది.

మార్కెట్‌లో నకిలీ నోటు!



- నకిలీ నోట్లను చూపుతున్న ఇతని పేరు నగేష్. ముదిగుబ్బ మండలం. ఈ ఏడాది ఆరంభంలో కదిరి మార్కెట్ యార్డులో రెండు పొట్టేళ్లను విక్రయించగా.. కొనుగోలు చేసిన వ్యక్తి రూ.32 వేలకు గానూ అన్నీ నకిలీ నోట్లే ఇచ్చాడు. ఇంటికి వెళ్లాక గుర్తించిన రైతు నగేష్ వెంటనే కదిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



- ఇటీవల బత్తలపల్లిలో ఓ కేటుగాడు రూ.10 విలువ చేసే సరుకు కొని ఇలా ఈ నకిలీ రూ.200 నోటు ఇచ్చారు. ఆ వ్యాపారి రూ.190 వెనక్కు ఇవ్వగా ఎంచక్కా జేబులో వేసుకుని వెళ్లాడు. ఆ డబ్బులు బ్యాంకు డిపాజిట్ చేసేందుకు వెళ్లిన చిరు వ్యాపారి అది కలర్ జిరాక్స్ అని తెలిసి లబోదిబోమన్నాడు.

- రెండు వారాల క్రితం కొత్తచెరువు గొర్రెల సంతలో ఓ గొర్రెల కాపరి తన పొట్టేళ్లను రూ.20 వేలకు ఓ వ్యాపారికి విక్రయించాడు. ఇచ్చిన డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లగా.. బ్యాంకు అధికారులు రూ.20 వేలల్లో రూ.3 వేలు (ఆరు రూ.500 నోట్లు) నకిలీగా తేల్చారు. సంతలో వ్యాపారి ఇచ్చినట్లు బాధితుడు తెలిపాడు.

- పుట్టపర్తిలో విదేశీ కరెన్సీ మార్పిడి ముసుగులో నకిలీ నోట్ల చెలామణి విచ్చలవిడిగా సాగుతోంది. రెండు నెలల క్రితం గోపురం క్రాస్ వద్ద ఓ వ్యక్తి... రూ.60 లక్షల మేర నకిలీ విదేశీ కరెన్సీ ఇచ్చి ఇండియన్ కరెన్సీ తీసుకువెళ్లాడు. ఆలస్యంగా గుర్తించిన స్థానికుడు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. తాను ఆర్‌బీఐ అనుమతి లేకుండానే 'విదేశీ కరెన్సీ మారకం' వ్యవహారాలు నడుపుతుండటంతో పోలీసులకు కూడా ఫిర్యాదు చేయలేకపోయాడు.

- జిల్లాలో కలకలం రేపుతున్న నకిలీ కరెన్సీ
- అమాయకులే లక్ష్యంగా కేటుగాళ్లు గాలం
- కొత్తచెరువు, పుట్టపర్తి, కదిరి పట్టణాల్లో అధికం
- హిందూపురంలో వాణిజ్య లావాదేవీల్లో నకిలీ నోట్లు
- పుట్టపర్తిలో విదేశీ కరెన్సీ ముసుగులో రూ.లక్షల్లో దోపిడీ
- గొర్రెలు, పశువుల సంతల్లో ఈజీగా నకిలీ నోట్ల మార్పిడి



సాక్షి, పుట్టపర్తి

మార్కెట్‌లో నకిలీ నోటు హల్‌చల్ చేస్తోంది. చిరువ్యాపారాలు, రైతులను టార్గెట్ చేసుకుని నకిలీ నోట్ల కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. సందు దొరికితే నకిలీ నోట్లు అంటగడుతున్నారు. బ్యాంకుకు వెళ్లినప్పుడు 'నకిలీ నోట్ల' వ్యవహారం బయటపడుతుండగా.. బాధితులు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోంది.

'డిజిటల్' అందుబాటులో ఉన్నా...

ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఏ, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ తదితర ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నా గ్రామీణులు వాటి జోలికి వెళ్లడం లేదు. ఒక్క నంబరు తేడాతో ఫోన్ పే ద్వారా లేనిపోని సమస్యలు వస్తుండటంతో పల్లెటూరి వ్యాపారులు కరెన్సీకే జై కొడుతున్నారు. దీంతో కేటుగాళ్లు అలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని ప్రతి వారం గొర్రెలు - మేకల సంత, పశువుల సంతల్లో జీవాలను కొనుగోలు చేసి నకిలీ నోట్లు కట్టబెట్టి పరారవుతున్నారు. జిల్లాలో చోటుచేసుకున్న నకిలీ ఘటనలన్నీ సంతల్లోనే జరగడం గమనార్హం. కొత్తచెరువు, గోరంట్ల, కదిరి, తనకల్లులో నకిలీ నోట్ల ఘటనలు వెలుగు చూశాయి. ఇక పుట్టపర్తిలో విదేశీ కరెన్సీ మార్పిడి పేరుతో నకిలీ నోట్లు అంటగడుతున్నట్లు సమాచారం. హిందూపురం పట్టణంలోనూ రూ.200 నకిలీ నోట్లు బయటపడ్డాయి.

పర్సెంటేజీలకు ఆశపడి..

ఇటీవల బయటి ప్రాంతాల నుంచి కొందరు కేటుగాళ్లు జిల్లాలో ప్రవేశించారు. నకిలీ నోట్ల కట్టలను.. అసలు నోట్లతో కలిపి చెలామణి చేస్తున్నారు. బెంగళూరులో ఓ వ్యక్తి దగ్గర నుంచి నకిలీ నోట్ల కట్టలు జిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. అతడి వద్ద నుంచి 30 శాతం పర్సెంటేజీతో కొందరు తీసుకొచ్చి.. మార్పిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.150 చెల్లిస్తే రూ.200 నకిలీ నోటు ఇస్తారు. దీన్ని మార్చుకుంటే రూ.50 అదనంగా వస్తుంది. ఆ పర్సెంటేజీకి ఆశపడి కొందరు యువకులు నకిలీ నోట్ల చెలామణి పనిలో బిజీగా గడుపుతున్నారు. ఎక్కడైతే ఎక్కువగా నగదు సహిత లావాదేవీలు ఉంటున్నాయో.. అక్కడ ఎంట్రీ ఇచ్చి మోసాలకు పాల్పడుతున్నారు.

ఎక్కువగా రూ.200 నోట్లే..

పెద్ద నోట్లతో ఎక్కువగా మోసం జరుగుతోందని ప్రచారం అవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రూ.500 నోట్లు ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తున్నారు. దీంతో నకిలీ నోట్ల మార్పిడి కొంచెం కష్టంగా మారడంతో నకిలీ కరెన్సీ మాయగాళ్లు రూ.200 నోట్లపై పడినట్లు సమాచారం. హిందూపురం పట్టణంలో చిరు వ్యాపారుల వద్ద రూ.200 నోట్ల కట్టలు అధికంగా వెలుగులోకి వస్తున్నాయి. ఆయా నోట్ల కట్టల్లో నకిలీ నోట్లు కలపడంతో మోసపోయిన ఘటనలు ఇటీవల కాలంలో నాలుగైదు వెలుగు చూశాయి. అయితే ఒక్కో వ్యక్తికి ఒకటి లేదా రెండు నోట్లు మాత్రమే రావడంతో పెద్ద నష్టం లేదని మౌనంగా ఉన్నట్లు తెలిసింది.

వదిలే ప్రసక్తే లేదు



పశువులు, గొర్రెల సంతల్లో నకిలీ నోట్ల చెలామణి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరిపై అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి. నకిలీ నోట్ల మార్పిడి నేరం . ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు. ఎవరు ఇచ్చారనే విషయం గుర్తుంచుకుని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయండి. సీసీటీవీ పుటేజీల ఆధారంగా గాలించి నిందితులను అదుపులోకి తీసుకుంటాం. – సతీశ్ కుమార్, జిల్లా ఎస్పీ

'స్వచ్ఛ హిందూపురం'లో భాగస్వాములు కావాలి

- ప్రజలకు కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపు


'స్వచ్ఛత హీ సేవలో' చీపురుపట్టి ఊడుస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

హిందూపురం టౌన్: 'స్వచ్ఛ హిందూపురం' నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ మున్సిపల్ పార్క్ వద్ద 'స్వచ్ఛత హీ సేవ'లో భాగంగా 'ఏక్ దిన్, ఏక్ గంట ఏక్ సాత్' చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక మహిళలతో కలిసి మున్సిపల్ పార్కుతో పాటు చుట్టుపక్కల పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం స్థానికుల ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందజేయడంతో పాటు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ పరిశుభ్రతకు కృషిచేసిన 8 మంది మున్సిపల్ కార్మికులను మెమెంటోలతో కలెక్టరు, మున్సిపల్ చైర్మన్ సత్కరించారు. అనంతరం కలెక్టర్ సప్పల్లమ్మ వీధి సుగూరులో 'పీఎం సూర్య ఘర్' పథకం ద్వారా లబ్ధిదారు నర్మద ఇంటిపై 3.24 కిలోవాట్లతో ఏర్పాటు చేసుకున్న రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ 'సూర్య ఘర్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, అధకారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన..

పట్టణంలోని మోతుకపల్లి వద్ద గల డంపింగ్ యార్డును కలెక్టర్ శ్యాంప్రసాద్ పరిశీలించారు. అక్టోబర్ 2 నాటికి డంప్ యార్డును శుభ్రం చేయాలన్నారు. అలాగే కొత్త డంప్ యార్డ్స్ ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

కంపోస్ట్ యార్డులో మట్టి దొంగలు

- ఇష్టానుసారం ఎర్రమట్టి తవ్వకాలు
- భారీగా ఏర్పడిన గొయ్యిలు
- తనకేమీ తెలియదన్న కమిషనర్


కంపోస్ట్ యార్డులో అక్రమంగా మట్టి తరలించడంతో ఏర్పడిన భారీ గుంతలు

చిలమత్తూరు: హిందూపురం సమీపంలోని 'బిట్' కళాశాల వెనుక వైపు ఉన్న మున్సిపల్ కంపోస్ట్ యార్డులో మట్టి దొంగలు పడ్డారు. ఎర్రమట్టి కోసం జేసీబీలతో తవ్వకాలు చేసి పట్టణంలోని లేఅవుట్లకు తరలించి రూ.కోట్లు సంపాదించారు. మట్టిదొంగల ధనదాహానికి కంపోస్టు యార్డు ప్రాంతమంతా పెద్దపెద్ద గుంతలు ఏర్పడటం చూస్తే ఏ స్థాయిలో మట్టి దందా సాగిందో అర్థం చేసుకోవచ్చు. నిత్యం వాహనరాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో తవ్వకాలు ఎలా జరిగాయో...ఎవరి జరిపారో తనకు తెలియదని ఇక్కడ విధుల్లో ఉండే గార్డు పేర్కొనడం విశేషం.

అధికారులకు తెలియకుండానే చేశారా?

33 ఎకరాల్లో ఉన్న కంపోస్ట్ యార్డు చుట్టూ ప్రహరీ ఉంది. నిత్యం వాహనాలు యార్డుకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఓ గార్డు కూడా విధుల్లో ఉంటారు. అయినా మట్టి తవ్వకాలు జరిగాయంటే ఇందులో మున్సిపల్ అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎర్రమట్టికి బాగా డిమాండ్ ఉండటంతో అధికార టీడీపీ లీడర్లతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై మట్టిదందా చేసి ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. రూ.కోట్లు విలువ చేసే మట్టిని ఎక్కడకు తరలించారు..? సూత్రధారులు ఎవరన్నది మాత్రం ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.

నాకూ ఈ మధ్యే తెలిసింది

కంపోస్ట్ యార్డులో మట్టి తవ్వకాలు జరిగినట్టు నాకూ ఈ మధ్యే తెలిసింది. యార్డును మధ్యాహ్నం రెండు గంటల వరకే తెరచి ఉంచుతాం. ఆలోపే పట్టణంలో సేకరించిన చెత్తను అక్కడకు తీసుకువెళ్లి డంప్ చేస్తాం. యార్డుకు పూర్తిగా ప్రహరీ లేదు. ప్రధాన దారిలో కాకుండా మరో దారిలో రాత్రి వేళల్లో మట్టిని తరలించినట్టు తెలుస్తోంది. ఎవరు చేశారన్న విషయం తెలుసుకుంటాం. అంతకంటే ముందు కేసు నమోదు చేయిస్తాం.

– మల్లికార్జున , మున్సిపల్ కమిషనర్

బాలకృష్ణకు పిచ్చి ముదిరింది

- ప్రజా సమస్యలు మాట్లాడకుండా మాజీ సీఎం జగన్‌ను దూషిస్తారా..?
- మరోసారి నోరు జారితే జాగ్రత్త..
- హెచ్చరించిన వైఎస్సార్ సీపీ 'పురం' సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: ''ఎవరైనా సరే తమ నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. కానీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాత్రం ఈ ప్రాంత సమస్యలను విస్మరించి కేవలం జగన్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నారు'' అని వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు పిచ్చి ముదిరిందన్నారు. అందుకే ఆయన అసెంబ్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అసభ్యంగా దూషిస్తూ పిచ్చిచేష్టలు చేశారన్నారు. సైకో అంటూ పదేపదే అంటున్న బాలకృష్ణ సైకో ఇజం గురించి రాష్ట్రంలో ఎవరినడిగినా చెబుతారన్నారు. తన ఇంట్లో జరిగిన కాల్పుల కేసు నుంచి బయటపడేందుకు బాలకృష్ణ... తనకు మెంటల్ అందని సర్టిఫికెట్ తెచ్చుకుంది నిజం కాదా... ఆనాడు మీ సైకో ఇజంతోనే కాల్పులు జరిపారా.. అని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ అని, ఆయన మీ పిచ్చి చేష్టలకు చిరునవ్వుతో సమాధానం చెప్పారన్నారు. రాష్ట్రమంతా గుండెల్లో పెట్టి చూసుకుంటున్న వ్యక్తిని చులకనగా మాట్లాడిన బాలకృష్ణకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. హిందూపురంలో అనేక సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారని, సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని... అసెంబ్లీలో వాటి గురించి మాట్లాడని బాలకృష్ణ... మైకు దొరగ్గానే మాజీ సీఎం జగన్‌ను దూషించడానికే సమయమంతా వెచ్చించారన్నారు. బాలకృష్ణ పిచ్చి వాగుడు చూసి జనమే ఛీదరించుకుంటున్నారన్నారు. మరోసారి ప్రజా నాయకుడు వైఎస్ జగన్‌ను తూలనాడితే ఉపేక్షించబోమని ఆమె హెచ్చరించారు.

ఆర్డీటీ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

- ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ కోసం సంఘటిత పోరాటం
- అఖిలపక్షాలు, ప్రజా సంఘాల ఏకగ్రీవ తీర్మానం

ధర్మవరం: దశాబ్దాలుగా పేదలకు చేయూతనందిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. పేదల బాగుకోరే సంస్థ పరిరక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని తీర్మానించారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో డాక్టర్ ఆదిశేషు అధ్యక్షతన ఆర్డీటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అఖిల పక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రగతిశీల చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఎంతో సేవలందిస్తున్న ఆర్డీటీని నిర్వీర్యం చేసేలా కేంద్రం ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. అధికారంలోకి రాకముందు ఆర్డీటీ సేవలను కొనియాడిన నేతలు. ఇప్పుడు ఆ సంస్థ మనుగడను ప్రశ్నార్థకం చేసేలా వ్యవహరించడం దారుణమన్నారు. విద్య, వైద్య, క్రీడా రంగాల్లో విశేష సేవలందిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆర్డీటీ సంస్థకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా ఆర్డీటీ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 29న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం రైల్ రోకోలు, జాతీయ రహదారుల దిగ్బంధం, జిల్లా బంద్ వంటి నిరసనలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి వేముల అమర్‌నాథ్‌రెడ్డి, దేవరకొండ రమేష్, బడన్నపల్లి నర్సింహులు, కౌన్సిలర్ గజ్జల శివ, అమీర్‌బాషా, పెద్దన్నతో పాటు పలువురు రాజకీయ, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతుకు కూటమి శఠగోపం

అమడగూరు మండలం పూలకుంటపల్లికి చెందిన రమణారెడ్డి అనే రైతు 2023 ఖరీఫ్‌లో 8 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాడు. అతివృష్టితో పంట పూర్తిగా దెబ్బతినింది. అప్పటి జగన్ ప్రభుత్వం 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా' అమలు చేసిన కారణంగా ఆ రైతు రూపాయి ప్రీమియం చెల్లించకుండానే బీమా అందుకున్నాడు. ఉచిత పంటల బీమా లేనట్లయితే ఆయనకు పెట్టుబడి కూడా చేతికందేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రీమియం డబ్బులు రైతులే చెల్లించాలని మెలిక పెట్టింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సగం మంది రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించలేదు. దీంతో వీరంతా ఈసారి బీమాకు దూరం కానున్నారు.



- ఉచిత పంటల బీమాకు మంగళం
- 'పీఎం ఫసల్' పేరుతో అన్నదాతల జీవితాలతో ఆటలు
- ప్రీమియం రైతులే చెల్లించేలా నిర్ణయం
- డబ్బు కట్టినా ఈ-క్రాప్ నమోదు చేస్తేనే పరిహారమంటూ మెలిక
- ప్రీమియం భారంతో చాలా మంది బీమాకు దూరం
- పంట నష్టపోయినా పరిహారం అందేది శూన్యం
- కూటమి సర్కారు తీరుపై మండిపడుతున్న రైతులు

కదిరి: అన్నదాతలపై పైసా భారం పడకుండా వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లు విజయవంతంగా అమలు చేసిన 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'కు చంద్రబాబు ప్రభుత్వం మంగళం పాడింది. ఈ పథకం స్థానంలో 2019కి పూర్వం ఉన్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు వాతావరణ ఆధారిత బీమాను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ప్రీమియం డబ్బులు రైతులే చెల్లించాలి. ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద కంది, జొన్న, వరి తదితర పంటలున్నాయి. వాతావరణ ఆధారిత బీమా పరిధిలో వేరుశనగ, అరటి తదితర పంటలను చేర్చారు. వరి పంటను గ్రామం యూనిట్‌గా, వేరుశనగను మండలం యూనిట్‌గా, కంది, జొన్న పంటలను జిల్లా యూనిట్‌గా పరిగణిస్తున్నారు.

రుణం తీసుకున్న వారికే బీమా..

జిల్లాలో 2,98,305 మంది రైతులు ఉండగా... వారిలో 1,69,018 మంది మాత్రమే ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించారు. అంటే దాదాపుగా సగం మంది రైతులు ప్రీమియం చెల్లించలేదు. బ్యాంకులో తీసుకున్న క్రాప్‌లోన్ రుణాలను రెన్యూవల్ చేసేది లేదని బ్యాంకర్లు మెలిక పెట్టడంతో ప్రీమియం చెల్లించక తప్పలేదని పలువురు రైతులు వాపోతున్నారు. రైతుకు అండగా ఉంటామని గొప్పలు చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత అన్నదాతలను అన్ని విషయాల్లోనూ మోసం చేస్తోందని మండిపడుతున్నారు.


గతంలో ఉచిత బీమాతో లబ్ధి ఇలా..

గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా'తో జిల్లాలోని 2,96,541 మంది రైతులు నాలుగేళ్లలో ఏకంగా రూ.718.57 కోట్లు లబ్ధి పొందారు. అది కూడా పైసా ప్రీమియం చెల్లించకుండానే. కానీ కూటమి సర్కార్ రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేలా ఫసల్ బీమాను అమలు చేస్తోంది. ఇప్పటికే పంటల పెట్టుబడికి అప్పులు చేసిన రైతులు ఇన్సూరెన్స్ మొత్తం కట్టలేక బీమాకు దూరమయ్యారు.

'ఈ–క్రాప్' మెలికతో ఇబ్బందులు..

రైతులు పంటనష్ట పరిహారం పొందాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవాలన్నా 'ఈ–క్రాప్' నమోదును కూటమి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో పంటలబీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించినప్పటికీ ఈ–క్రాప్ నమోదు చేయకపోతే బీమా వర్తించదు. 'అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన'కు కూడా ఈ–క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాల్సిందేనని కూటమి సర్కార్ చెబుతోంది. కానీ గతంలో ఎలాంటి నిబంధనలు లేకుండా అప్పటి జగన్ ప్రభుత్వం రైతులు రూపాయి ప్రీమియం చెల్లించకుండానే పంటల బీమా ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం మాత్రం రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వమే చెల్లించాలి



గత ప్రభుత్వం లాగానే కూటమి ప్రభుత్వం కూడా ఉచిత పంటల బీమాను అమలు చేస్తే బాగుంటుంది. రైతులు రూపాయి కూడా చెల్లించకుండానే జగన్ ప్రభుత్వం రైతులకు బీమా డబ్బులు ఇచ్చింది. కానీ ఈ ప్రభుత్వం రైతులపై ప్రీమియం భారం మోపింది. అందుకే చాలామంది రైతుల బీమాకోసం ప్రీమియం చెల్లించలేదు. వారందరికీ బీమా వర్తించదు.

– రైతు ఓబిరెడ్డి, బుచ్చయ్య గారిపల్లి, బుక్కపట్నం మండలం

ప్రీమియం చెల్లించిన వారికే బీమా

సకాలంలో ప్రీమియం చెల్లించిన వారికి మాత్రమే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుంది. మిగిలిన వారికి వర్తించదు. సాధారణంగా బ్యాంకులో క్రాప్‌లోన్ పొంది రెన్యూవల్ చేసుకున్న వారంతా బీమా ప్రీమియం చెల్లించారు. వారందరికీ పంటల బీమా వర్తిస్తుంది. ప్రీమియం చెల్లించని వారికి బీమా వర్తించదు.

– రామునాయక్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది : కలెక్టర్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రశాంతి నిలయం: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు -2025 పోస్టర్లను గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. నవంబర్ 7, 8, 9 తేదీల్లో అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం వేదికగా 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడాసాంస్కృతిక ఉత్సవాలు-2025 జరగనున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలు, సీసీఎల్ఏ కార్యాలయం నుంచి 27 యూనిట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ రామిశెట్టి వెంకటరాజేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎలుగు బంట్ల దాడిలో రైతుకు గాయాలు



చికిత్స పొందుతున్న రైతు వెంకటేశప్ప

పావగడ: తాలూకాలోని నాగలాపురం గేట్ గ్రామానికి చెందిన రైతు వెంకటేశప్ప పై రెండు ఎలుగుబంట్లు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గురువారం ఉదయం పొలం పనులు చేసుకుంటున్న సమయంలో రెండు ఎలుగుబంట్లు దాడి చేయడంతో వెంకటేశప్ప తల, వెన్ను, తదితర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే క్షతగాత్రుడిని తుమకూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారి బసవరాజు.. ఆస్పత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

నిర్మాణ రంగ కార్మికులపై చిన్నచూపు

- ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి నేతలు
- ఏడాదిన్నరగా సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు
- ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాలకు సిద్ధమని ప్రకటన



భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు



సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు (ఫైల్)

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భవన నిర్మాణ రంగ కార్మికులు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకున్న అధికార పార్టీ నాయకుల తీరుతో పనులు లేక నిర్మాణ రంగ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో తమకిచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఆందోళన బాట పట్టారు. ఇప్పటికే కలెక్టరేట్‌ల వద్ద, కార్మిక శాఖ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వంలో కనీస చలనం కూడా లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం మెడలు వంచే దిశగా ఉద్యమాలను ఉధృతం చేసే దిశగా పక్కా కార్యాచరణతో పోరాటాలకు కార్మికులు సిద్ధమవుతున్నారు.

సంక్షేమం ఊసెత్తని కూటమి సర్కారు..

జిల్లాలో 2.50 లక్షల మందికి పైగా అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. తాపీ, పెయింటింగ్, రాడ్‌బెండింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, సెంట్రింగ్, మార్బుల్స్, టైల్స్, కంకర, ఇసుక రవాణా, మట్టి పని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తదితర పనులతో జీవిస్తున్న వారు ప్రస్తుతం పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకున్న టీడీపీ నేతలు.. పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా తరలించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇసుక కొరత కారణంగా స్థానికంగా పనులు లేక భవన నిర్మాణ రంగ కార్మికులు పస్తులతో బతకాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి స్పష్టమైన హామీలు ఇచ్చిన కూటమి పెద్దలు.. అధికారం చేపట్టిన తర్వాత సంక్షేమం ఊసెత్తక పోవడంతో కార్మికుల్లో అసహనం రేకెత్తుతోంది.

> ‘మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు అండగా ఉంటుంది. ప్రమాదవశాత్తూ ఏమైనా జరిగితే కుటుంబాలను ఆదుకునే బాధ్యతను తీసుకుంటుంది’
>
> ... ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది.

తుంగలోకి ఎన్నికల హామీలు..

గత సార్వత్రిక ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూటమి పెద్దలు తుంగలోకి తొక్కారు. గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006లో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, కార్మికుల సంక్షేమానికి అవసరమైన తొమ్మిది రకాల పథకాలు అమలు చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని అప్పట్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్పష్టమైన హామీలు ఇచ్చారు. ఉచిత ఇసుక సరఫరా చేసి భవన నిర్మాణ రంగాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఒక్క హామీనీ నెరవేర్చలేదు. ఇదే విషయాన్ని స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధుల దృష్టికి భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నాయకులు తీసుకెళ్లినా... ఫలితం దక్కలేదు. ఇసుక ధరలు పెరిగి భవన నిర్మాణాలు ఆగిపోవడంతో పనులు లేక కార్మికులు రోడ్డున పడ్డారు.

భవన నిర్మాణ కార్మికుల ప్రధాన డిమాండ్లు ఇవే

- మెమో 12, 14 రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి. సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
- కార్మికులందరికీ తొమ్మిది రకాల సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి.
- జిల్లా వ్యాప్తంగా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.8 కోట్ల బకాయిలను విడుదల చేయాలి
- ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి.

ఆందోళనలు ఉధృతం చేస్తాం



భవన నిర్మాణ రంగ కార్మికులకు ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్ అనేక హామీలు ఇచ్చారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని నమ్మబలికారు. అధికారం చేపట్టిన తర్వాత నేటికీ ఒక్క హామీనీ నెరవేర్చలేదు. ఎమ్మెల్యేలు సైతం కార్మికుల సమ్యస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే పరిస్థితి లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో కలెక్టరేట్‌ల, కార్మిక శాఖ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాల్సి వచ్చింది. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. డిమాండ్ల సాధనకు ఉద్యమాలు ఉధృతం చేస్తాం.

– సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

రూ.10 లక్షల అపహరణ

ధర్మవరం అర్బన్: కుమారుడి చదువు కోసం అప్పు చేసి తెచ్చిన రూ.10లక్షలను దుండగులు అపహరించుకెళ్లడంతో బాధితురాలి ఆవేదనకు అంతు లేకుండా పోయింది. వివరాలు.. ధర్మవరంలోని లక్ష్మీచెన్న కేశవపురంలో నివాసముంటున్న దేవాంగం సూర్యనారాయణ, గీతమ్మ దంపతులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరి కుమారుడు సాయికుమార్ ఇంటర్ పూర్తవ్వడంతో ఉన్నత చదువుల కోసమని మొత్తం రూ.10లక్షలు నగదును సమకూర్చుకుని ఇంటిలో భద్రపరిచారు. ఈ నెల 23న కుమారుడిని గుంటూరు కళాశాలలో చేర్పించడానికి సూర్యనారాయణ వెళ్లారు. 24న గోరంట్లలో తన అక్క మహేశ్వరమ్మ ఇంట్లో కార్యక్రమం ఉండగా గీతమ్మ ఇంటికి తాళం వేసి వెళ్లింది. గురువారం ఉదయం గోరంట్లలో సూర్యనారాయణ, సాయికుమార్ ఇద్దరూ గోరంట్లకు చేరుకున్నారు. అదే సమయంలో పక్కింటి వారు ఫోన్ చేసి ఇంటి తలుపులు బద్దలుగొట్టి ఉన్నట్లుగా సమాచారం అందించడంతో హుటాహుటిన ధర్మవరానికి చేరుకున్నారు. ఇంట్లో భద్రపరిచిన రూ.10లక్షల నగదుతో పాటు మూడు జతల బంగారు కమ్మలు, ఉంగరం అపహరించినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కేసు నమోదు చేశారు.

దళారుల రాజ్యం.. రైతు నిలువు దోపిడీ





ప్యాపిలి మార్కెట్‌లో వేలానికి ఉంచిన టమాట బాక్సులు , టమాట బాక్సుకు రూ.70తో వేసిన బిల్లు

- ఆదాయం రాకపోగా రైతన్నకు చేతి నుంచి రూ.600 ఖర్చు

పెద్దపప్పూరు: దళారులు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తుండడంతో టమాట రైతు నిలువు దోపిడీకి గురయ్యాడు. పంటను మార్కెట్‌కు తరలిస్తే లాభం మాట దేవుడెరుగు... రైతు చేతి నుంచే రూ. వందలు ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. వివరాలు... పెద్దపప్పూరుకు చెందిన టమాట రైతు షేక్ రఫీ గురువారం 25 కిలోల చొప్పున 31 బాక్సుల టమాటను బొలెరో వాహనంలో నంద్యాల జిల్లా ప్యాపిలిలోని మార్కెట్‌లో విక్రయానికి తీసుకెళ్లాడు. ఇందుకుగాను వాహనానికి రూ.1,500 అద్దె చెల్లించాడు. అక్కడి దళారులు గ్రేడింగ్ చేసి 31 బాక్సులను కాస్త 23 బాక్సులకు కుదించారు. బాక్సుకు రూ.70 చొప్పున వేలం పాడడంతో రూ.1,610 వచ్చింది. దళారుల కమీషన్ రూ.160 పోను రూ.1,450 చేతికి అందింది. పంట కోసిన కూలీలకు రూ. 600 రైతు చేతి నుంచి ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చింది. ఒక్క రూపాయి ఆదాయం రాకపోగా చేతి నుంచి మరింత ఖర్చు పెట్టాల్సి రావడంతో రైతు ఆవేదనకు అంతులేకుండా పోయింది.

వ్యక్తి దుర్మరణం

రాప్తాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం పాతూరులోని భవానీ నగర్‌లో నివాసముంటున్న కురుబ మల్లేశప్ప (53), రమాదేవి దంపతులు తోపుడు బండిపై అరటి కాయల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మల్లేశప్ప రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో అరటి తోటలు చూసుకుని 44వ జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి శరవేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. రాత్రి 7 గంటలకు మృతుడిని మల్లేశప్పగా కుటుంబసభ్యులు నిర్ధారించారు. ఘటనపై సీఐ టి.వి.శ్రీహర్ష కేసు నమోదు చేశారు.

‘గురుకుల’ సిబ్బంది నిర్లక్ష్యానికి చిన్నారి మృతి



బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యానికి ఓ చిన్నారి బలైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సేవా సుప్రీం ఏజెన్సీ కింద పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న కృష్ణవేణి కుమార్తె, 17 నెలల వయసున్న చిన్నారి 3 రోజుల క్రితం గురుకుల పాఠశాల సిబ్బంది కాచి పక్కన ఉంచిన పాలలో పడి తీవ్రంగా గాయపడింది. దీంతో గుట్టుచప్పుడు కాకుండా చిన్నారిని కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చిన్నారి మృతి చెందింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని దళిత సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

21 ఎల్‌పీజీ సిలిండర్ల సీజ్

గుత్తి: స్థానిక గాంధీ సర్కిల్ సమీపంలో జిలాన్ గ్యాస్ ఫిల్లింగ్ దుకాణంలో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా నిల్వ చేసిన 21 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ నరేంద్ర భూపతి, సీఎస్‌డీటీ జీవీ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్‌కు విఫల యత్నం

పావగడ: స్థానిక ఎంఏఆర్ లే అవుట్‌లో చైన్ స్నాచింగ్‌కు ప్రయత్నించి ఇద్దరు యువకులు భంగపడ్డారు. వివరాలు.. మాజీ కౌన్సిలర్ మహాలక్ష్మమ్మ ఎంఏఆర్ లే అవుట్‌లో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం 6.0 గంటల సమయంలో వ్యాపారం చేస్తుండగా ఇద్దరు యువకుడు అక్కడకు చేరుకుని తమకు విక్స్ బిళ్లలు కావాలని అడిగారు. ఆ సమయంలో విక్స్ బిళ్లలు ఉన్న డబ్బా తీసుకునేందుకు వెనుతిరిగిన మహాలక్ష్మమ్మ మెడలోని బంగారు చైన్‌ను లాగేందుకు ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన ఆమె వెంటనే మెడలోని చైన్‌ను పట్టుకుని గట్టిగా కేకలు వేయడంతో వదిలేసి దుండగులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

సూక్ష్మ సేద్య పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

పుట్టపర్తి అర్బన్: సూక్ష్మ సాగు నీటి పథకం కింద మంజూరు చేసే బిందు, తుంపర సేద్య పరికరాలపై జీఎస్టీ 5 శాతానికి కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో యూనిట్ వ్యయంపై జీఎస్టీ 12 శాతం ఉండేదన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతులకు యూనిట్ వ్యయంపై 7 శాతం ఆదా అవుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని బిందు, తుంపర పరికరాల కోసం సమీపంలోని ఆర్‌ఎస్‌కేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

మెట్ల పైనుంచి పడి వ్యక్తి మృతి

తలుపుల: మండలంలోని ఓబులరెడ్డిపల్లికి చెందిన రవీంద్ర (34) బుధవారం ఇంటి పైకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతూ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు దెబ్బ తగలడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య పల్లవి, 16 నెలల వయసున్న ఓ కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం పల్లవి గర్భిణి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సీటీఓ ఉద్యోగులపై విచారణకు ఆదేశం

గుంతకల్లు: స్థానిక వాణిజ్య శాఖ కార్యాలయంలో పని చేస్తున్న ఏసీటీఓ, అటెండర్ అవినీతిపై విచారణకు రాష్ట్ర వాణిజ్య శాఖ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఇరువురిపై సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ ఈ నెల 16న సీటీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదుకు స్పందించిన వాణిజ్య శాఖ అధికారులు అక్టోబర్ 1న వ్యాపారుల సమక్షంలో విచారణ జరిపించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు ఫిర్యాదుదారుడు గురువారం తెలిపారు.

యూరియా కోసం తప్పని పడిగాపులు



ఆత్మకూరు మండలం మదిగుబ్బ ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

కణేకల్లు/ఆత్మకూరు: యూరియా కష్టాలు రైతులను వీడడం లేదు. గురువారం కణేకల్లులోని ఆర్‌ఎస్‌కే, ఆదర్శభారతి రైతు సేవా కేంద్రాల వద్ద, ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామంలోని ఆర్‌ఎస్‌కే వద్ద గంటల తరబడి రైతులు పడిగాపులు పడాల్సి వచ్చింది. కణేకల్లులో ఎండలో నిలబడలేక పాసు పుస్తకాలను క్యూ లైన్‌లో ఉంచారు. తమ వంతు రాగానే టోకెన్లు చూపి యూరియా బస్తాను తీసుకెళ్లారు. వ్యవసాయ అధికారులు స్పందించి ఒక్కో రైతుకు ఐదారు బస్తాలిస్తే కొంత ఊరట ఉంటుందని ఈ సందర్భంగా పలువురు రైతులు కోరారు.

యువ పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్: రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఇండస్ట్రీయల్ పార్క్ పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న యువ పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్క్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయన్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక రాయితీలను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఓసీ, బీసీలకు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న పారిశ్రామిక వేత్తలు బళ్లారి రోడ్డులోని ఏపీఐఐసీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

● ఉక్కిరిబిక్కిరి!

దసరా పండుగ నేపథ్యంలో కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో జిల్లా కేంద్రంలోని వివిధ ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థల వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో పిల్లలను పిలుచుకెళ్లేందుకు ఉచిత బస్సు ప్రయాణం కావడంతో గతంలో కంటే భిన్నంగా ఈ సారి తల్లులే అత్యధికంగా వచ్చారు. బస్సుల సంఖ్య పెంచక పోవడంతో ఉన్న బస్సులన్నీ కిక్కిరిశాయి. బస్టాండ్ పాయింట్‌లో బస్సు ఆగగానే ఎక్కేందుకు మహిళలు పోటీ పడ్డారు. తోపులాట చోటు చేసుకుంది. ఇక పురుషులు బస్సు కిటికీల నుంచి లోపలకు ప్రవేశించాల్సి వచ్చింది.

– అనంతపురం క్రైం/సాక్షి ఫొటోగ్రాఫర్:



అనంతపురం బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు తోసుకుంటున్న మహిళలు







చిన్నారిని లోపలకు తీసుకుంటున్న దృశ్యం, మహిళల తోపులాట ఉండడంతో కిటికీ నుంచి బస్సులోకి వెళుతున్న ప్రయాణికులు



తోపులాటలో చిక్కుకుని రోదిస్తున్న మహిళ